ప్రజాశక్తి

శుక్రవారం 20 డిసెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి




ప్రజలకు అండ... ఎర్రజెండా

- ఫార్మా, సెజ్ కార్మికుల భద్రత కోసం రక్షణ యాత్ర
- బాధితులకు పరిహారం చెల్లింపుపై చొరవ
- పారిశ్రామిక ప్రమాదాలు, పర్యావరణ ప్రమాణాలపై అవగాహన
- వివిధ తరగతుల సమస్యలపై నిరంతర పోరాటాలు
- 21, 22న సిపిఎం అనకాపల్లి జిల్లా మహాసభ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఫార్మా, సెజ్ పరిశ్రమల్లో బాధితుల న్యాయం కోసం సిపిఎం నిరుపమానమైన కృషి చేసింది. పరిశ్రమల ప్రమాదాలు, కార్మికులు, ఉద్యోగుల భద్రత, కాలుష్యం, నిర్వాసితులు, స్థానికులకు ఉపాధి వంటి పలు సమస్యలపై జోక్యం చేసుకుంది. పాలక పార్టీలు విస్మరించిన అనేక సమస్యలపై స్పందించింది. కార్మికుల బాధలను గుర్తెరిగి భరోసా ఇచ్చింది. పరిశ్రమల ప్రమాద సమయాల్లో బాధిత కుటుంబాలకు అండగా నిలిచింది. పోట్లాడి పరిహారం ఇప్పించింది. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించగలిగింది. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనబెట్టి గెలిపించిన ప్రజలను వంచన చేస్తున్న ప్రభుత్వాల తీరును ప్రజలకు వివరించేందుకు యాత్రలు చేపట్టింది. శ్రామికవర్గం సమస్యలపై నిత్యమూ స్పందించి వారి పక్షాన నిలిచిన సిపిఎం అనకాపల్లి జిల్లా 24వ మహాసభ ఈ నెల 21, 22 తేదీల్లో నర్సీపట్నంలో జరుగుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.



ఫార్మా, సెజ్‌లోని వివిధ పరిశ్రమల్లో కార్మికులకు చట్టపరమైన ఇఎస్ఐ, పిఎఫ్, ఇతర సదుపాయాలు వర్తించడంలేదు.



ఫార్మా, సెజ్ కార్మికుల భద్రత కోసం సాగుతున్న సిపిఎం బైక్‌యాత్ర (ఫైల్ ఫొటో)

పనిచేసే చోట రక్షణ లేదు. ఉద్యోగ భద్రత లేదు. కనీస వేతనాలు అమలుకావడంలేదు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పరిశ్రమాధిపతులకు ప్రభుత్వాలు కల్పించిన స్వేచ్ఛ కార్మికుల

మిగతా 2లో..

'రివర్స్ డైరెక్షన్'లో తీవ్ర అల్పపీడనం

ఉత్తరాంధ్ర జిల్లాల్లో రాగల 3 మూడు రోజులు వర్షాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నైరుతి బంగాళా ఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడన ప్రాంతం ఈ నెల 19వ తేదీ నాటికి 'రివర్స్ డైరెక్షన్'లో దక్షిణ ఆంధ్రప్రదేశ్ వైపునకు వస్తూ, ఈ నెల 20వ తేదీ రాత్రి నాటికి ఎపి తీరం వెంబడి ఉత్తరం వైపు కదిలి రావడంతో ఉత్తరాంధ్రలో పలుచోట్ల భారీ వర్షాలు కురవనున్నాయి. ఇప్పటికే విశాఖలో గురువారం ఉదయం నుంచీ నిరంతరాయంగా గాలులు, వర్షం కురుస్తూనే ఉన్నాయి. ఒకవైపు మబ్బు మరోవైపు జల్లులతో నగరం అంతా తడసి ముద్దయింది. ఈ మేరకు విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు గురువారం రాత్రి వెల్లడించిన వివరాల ప్రకారం తీవ్ర అల్పపీడన ప్రాంతం 19వ తేదీ ఉదయం 8.30 గంటలకు పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో ఉంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఏర్పడడంతో రాగల 12 గంటల్లో అంటే 19వ తేదీ అర్ధరాత్రికి ఉత్తర తమిళనాడు, దక్షిణాంధ్రప్రదేశ్ తీరం వైపు అంటే దాదాపు వాయువ్య దిశగా వెళ్తోంది. ఆ తర్వాత 24 గంటల్లో అంటే 20వ తేదీ రాత్రినాటికి ఎపి తీరం వైపు 'రివర్స్ కర్వ్' కదులుతూ దాదాపు ఉత్తరం వైపునకు ప్రయాణిస్తుండడంతో ఉత్తరాంధ్రతో పాటు దక్షిణాంధ్రలోగల పలు జిల్లాల్లోనూ కొన్నిచోట్ల భారీ వర్షాలు రాగల 3 మూడురోజుల్లో



విశాఖలో వర్షానికి అవస్థలు పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు

కురుస్తాయని తెలుస్తోంది. ఉత్తర కోస్తా జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు 19వ తేదీ రాత్రి కురిసే అవకాశాలుండగా బలమైన ఈదురుగాలులు గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో వీస్తాయి. 20న ఇదే పరిస్థితి కొనసాగనుండగా దక్షిణ కోస్తా ఆంధ్రలో కొన్నిచోట్ల వర్షాలు కురుస్తాయి. రాయలసీమలో జల్లులకు అవకాశం ఉంది.

లోతట్టు ప్రాంతాలకు నీటి ముప్పు...

నగరంలోని లోతట్టు ప్రాంతాలైన కొండవాలు ప్రాంతాలు, కెఆర్ఎం కాలనీ, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలు, నెహ్రూ బజారు, మాధవదార, బర్మాకాలనీలోని పలు ఏరియాల్లో వర్షపు నీటితో జనం అవస్థలు పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వన్‌టౌన్ ప్రాంతంలోని పాత భవనాలున్న చోట్ల జనం తీవ్ర భయాందోళనలతో ఉంటున్నారు. తీవ్ర అల్పపీడనంతో నెమ్మది నెమ్మదిగా వర్షపు నీరు వచ్చి గోడల్లోకి చేరిపోవడంతో పాత

మిగతా 2లో..

తొలగించిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

▶ వార్త 8లో..

4న నావికాదళ విన్యాసాలు

▶ వార్త మెయిన్‌లో..

450 కిలోల గంజాయి పట్టివేత

▶ వార్త 3లో..

29లోగా సమస్యలు పరిష్కరించకుంటే డెయిరీ స్తంభన

▶ వార్త 4లో..



వడ్లపూడిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

వార్త 8లో....

ఉపాధ్యాయుల తిప్పలు

- పోలీసు స్టేషన్‌లో సమ్మేటివ్ ప్రశ్నా పత్రాలు డిపాజిట్
- రెండు పూటలా తీసుకెళ్లాలని ఆదేశం
- రవాణా, భద్రత సమస్యలపై టీచర్లలో ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

సమ్మేటివ్-1 పరీక్షల లెక్కల ప్రశ్నాపత్రం లీకు ప్రధానోపాధ్యాయుల మెడకు చుట్టుకుంది. లెక్కల ప్రశ్నాపత్రం లీకైందన్న కారణంతో పరీక్షలను వాయిదా వేసిన విద్యాశాఖ, ప్రశ్నా పత్రాలు పోలీసు స్టేషన్‌లో డిపాజిట్ చేసి అక్కడ నుంచి తీసుకెళ్లాలని ఆదేశాలు జారీచేసింది. పోలీసు స్టేషన్ నుంచి డిపాజిట్ చేసిన ప్రశ్నా పత్రాలను రెండు పూటలా తీసుకెళ్లే బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించింది. స్ట్రాంగ్ రూమ్ నుంచి ప్రశ్నా పత్రాలు తీసుకెళ్లిన మండల విద్యాశాఖాధికారితో పాటు పోలీసు స్టేషన్‌లో తమ పాఠశాల ప్రశ్నాపత్రాలు డిపాజిట్ చేసినప్పుడు ఉపాధ్యాయులు పడిగాపులు పడ్డారు. పోలీసు స్టేషన్‌లో డిపాజిట్‌చేసిన రోజు రాత్రి ఇళ్లకు వెళ్లలేక నానావస్థలుపడ్డారు. పోలీసు స్టేషన్‌లో ప్రశ్నా పత్రాలను

మిగతా 2లో..

పరీక్ష పేపర్లు పాఠశాలకు చేర్చాలి

సమ్మేటివ్ పరీక్ష ప్రశ్నా పత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి గంట ముందు తీసుకెళ్లి పరీక్ష నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీచేయడం సరికాదు. పరీక్ష పేపర్లు లీకవుతున్న విషయం యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదు. లీకేజీకి ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు కారణంకాదు. ప్రభుత్వం పేపర్ల లీజేజీకి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి. పాఠశాలలకు నేరుగా ప్రశ్నా పత్రాలు చేర్చాలి. దూరప్రాంత పాఠశాలలకు పేపర్లు తీసుకెళ్లడం రవాణా సమస్య, భద్రతా రీత్యా శ్రేయస్కరంకాదు. పాఠశాలలకు పరీక్ష పేపర్లు అందజేసే బాధ్యత విద్యాశాఖాధికారులకు విద్యాశాఖ అప్పగించాలి.



గొంది చిన్నబ్బాయ్,
అనకాపల్లి జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి

మొదటి పేజీ తరువాయి..

ప్రజలకు అండ.. ఎర్రజెండా

పాలిట శాపంగా మారాయి. కార్మికుల ప్రాణాలకు ప్రభుత్వం, యాజమాన్యాలు విలువ ఇవ్వడంలేదు. పరిశ్రమల ప్రమాదాలకు యజమాన్య వైఫల్యాలు బయటపడుతున్నా చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వాలు వెనుకడుగువేస్తున్నాయి. సేఫ్టీ ఆడిట్ నిర్వహించని ప్రమాదకర పరిశ్రమల ఉత్పత్తిని నిలిపివేయడంలేదు. ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి స్వతంత్ర తనిఖీ అధికారాలను ప్రభుత్వం కుదించింది. టిడిపి, వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వమేదైనా కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించడంలేదు.

అసెన్షియా, సినర్జిన్, సాహితీ, ర్యాంకీ, హెటిరో, అభిజిత్, సింబయో వివిధ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలను సాధారణ విషయంగా ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం, యాజమాన్యం తీసుకున్నాయి. ఇతర రాజకీయ పక్షాలు కార్మికుల పక్షాన లేకపోయినా సిపిఎం చొరవ తీసుకొని వారి తరపున నిలబడింది. సిపిఎం, సిఐటియు జోక్యంతో బాధిత కార్మిక కుటుంబాలకు పరిహారం చెల్లింపులో న్యాయం జరుగుతోంది. అచ్యుతాపురం బ్రాండిక్స్‌లో విషవాయువు లీకైన రెండుసార్లు అస్వస్థతకు గురైన మహిళలను ఆస్పత్రులకు చేర్పించి వైద్యం అందించడంలో పార్టీ కార్యకర్తలు మంచి కృషి చేశారు. సముద్రంలోకి వ్యర్థ రసాయనాలను విడుదల చేసే హెటిరో పైపులైన్ పనులకు వ్యతిరేకంగా మత్స్యకారులు, ఇతర ప్రజలు చేపట్టిన పోరాటానికి సిపిఎం అండగా నిలిచింది.

పరిశ్రమల ప్రమాద సమయాల్లో కార్మికులు, వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషిచేస్తూనే, పారిశ్రామిక ప్రాంతాల్లో అవగాహన కల్పనకు సిపిఎం చైతన్యయాత్రలు చేపట్టింది. ఫార్మా సెజ్ కార్మికులు, ప్రజల భద్రత కోసం రక్షణ యాత్ర చేపట్టింది. ఈ బైక్‌యాత్ర ఈ ఏడాది సెప్టెంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు సాగింది. పరిశ్రమల ప్రభావిత తొమ్మిది మండలాలు, 62 గ్రామాల్లో 300 కిలోమీటర్లలో బైక్‌యాత్ర సాగింది. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి జరుగుతున్న మోడీ ప్రభుత్వ కుట్రలను పూరావాడా వెళ్లి తెలియజేసేందుకు ఉత్తరాంధ్ర బైక్ యాత్ర చేపట్టింది. తాడి వద్ద ల్యాండ్ ఫిల్ రద్దు, కె.కోటపాడు మండలంలో క్వార్జ్ తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజలను సిపిఎం కదిలించింది. పరవాడ మండలంలో తాడి, అచ్యుతాపురం మండలంలో చినపూడిని తరలించాలని ఆందోళన చేపట్టింది. పర్యావరణ ప్రమాణాలు పాటించక పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యం పాలవడంతో పరవాడ ర్యాంకీ కాలుష్యంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)లో పిటిషన్ వేసింది. పాయకరావుపేట మండలం వెంకటనగరం వద్ద సముద్రంలో కాకినాడ సెజ్ పరిశ్రమల వ్యర్థ రసాయనాలను విడుదల చేసే పైపులైన్ పనులకు వ్యతిరేకంగా మత్స్యకారుల ఆందోళనలో జోక్యం చేసుకుంది. ఇతర రాజకీయ పార్టీలు ఎన్ని పిల్లిమొగ్గలు వేస్తున్నా, సిపిఎం జిల్లాలో వివిధ తరగతుల ప్రజలెదుర్కొంటున్న అనేక సమస్యలపై తమ శక్తిమేరకు పోరాటాలు నిర్వహిస్తోంది. పరిష్కారాలు చూపిస్తూ కష్టజీవులు, శ్రామికవర్గం తరపున పనిచేస్తోంది.

'రివర్స్ డైరెక్షన్'లో తీవ్ర అల్పపీడనం

ఇల్లు కూలిపోయే ప్రమాదం లేకపోలేదు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం ఇలాంటి సమయాల్లో అధికారులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం అనేక చోట్ల కురిసింది. తుపాన్ల సందర్భంగా ఎలాంటి చర్యలైతే తీసుకుంటున్నారో ఆ తరహాలోనే ప్రజలను అలర్ట్ చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నది పలువురి నుంచి వినిపిస్తున్న మాట.

365 హెక్టార్లలో వరి కోతలు ఆగాయి : వ్యవసాయ శాఖ జేడీ అప్పలస్వామి

విశాఖపట్నం జిల్లాలోగల నాలుగు మండలాల పరిధిలో సుమారు 365 హెక్టార్లలో వరి కోతలు కోయలేదని, పొలాల్లోనే పంట ఉండిపోయిందని విశాఖ జిల్లా వ్యవసాయ జెడి అప్పలస్వామి ప్రజాశక్తికి తెలిపారు. ప్రస్తుతానికి పొలాల్లో నీరు నిల్వ ఉన్న పరిస్థితి లేదన్నారు. 20వ తేదీన భారీ వర్షాలున్నాయని వాతావరణ కేంద్రం హెచ్చరించిందని ఆ మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని, నష్టం జరగకుండా రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల తిప్పలు

డిపాజిట్ చేసి, పరీక్ష రోజు తీసుకెళ్లాలన్న ఆదేశాలతో విద్యార్థుల కంటే ఉపాధ్యాయులకు పెద్ద పరీక్షలా ఉంది.

జిల్లాలో పోలీసు స్టేషన్‌కు కిలోమీటరు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వ పాఠశాలలున్నాయి. రెండుపూటలా జరిగే పరీక్షలకు రెండుసార్లు స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లడం ఉపాధ్యాయులకు భారంగా తయారైంది. 6, 8, 10 తరగతులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 7, 9 తరగతులకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలూ పరీక్ష పత్రాలు తీసుకెళ్లడం ఇబ్బందిగా ఉంటుందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలను ముందు రోజు పోలీస్ స్టేషన్లో డిపాజిట్ చేసి, పరీక్ష రోజు ఉదయం పరీక్ష కేంద్రం వద్దకు తీసుకెళ్లడం ఆనవాయితీగా ఉంది. క్వార్టర్లీ పరీక్షలకు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా ప్రభుత్వమే ప్రశ్నా పత్రాలను పాఠశాలలకు పంపించేది. ఈసారి అందుకు భిన్నంగా సమ్మేటివ్ పరీక్షలకు పోలీస్ స్టేషన్లో ప్రశ్న పత్రాలు డిపాజిట్ చేసి మరుసటి రోజు తీసుకెళ్లాలన్న విద్యాశాఖ ఆదేశంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంత పాఠశాలల ఉపాధ్యాయులు ముందు రోజు రాత్రి పేపర్లను డిపాజిట్ చేసి తరువాత రోజు పాఠశాలలకు తీసుకెళ్లాల్సివుంది. పోలీసు స్టేషన్ నుంచి పాఠశాలలకు సరైన రవాణా వసతిలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

రాష్ట్రాల విద్యుత్ శాఖలను ప్రైవేటుపరం చేయొద్దు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రాల ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లను ప్రైవేట్ పరం చేయడం సరికాదని, ఇది ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జెఎసి విశాఖ జిల్లా ఛైర్మన్ ఎస్.చిరంజీవులు, కన్వీనర్ కెటి.భాస్కరరావు, డిస్కమ్ ఛైర్మన్ వివిఎస్ఆర్‌కె గణపతి అన్నారు. ప్రైవేటీకరణను నిరసిస్తూ గురువారం గ్రీన్ పార్క్ హోటల్‌కు ఎదురుగా ఉన్న ఎలక్ట్రిసిటీ ఎస్ఇ కార్యాలయం ఆవరణలో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్, చండీగఢ్ రాష్ట్రాల ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్‌లను ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వాలు పూనుకున్నాయని తెలిపారు. 2022 విద్యుత్ సవరణ బిల్లు చట్టం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి సంఘీభావంగా ఇక్కడ నిరసన చేపట్టినట్లు తెలిపారు.

మైనారిటీల హక్కులపై శిక్షణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మైనారిటీల హక్కుల దినోత్సవం సందర్భంగా వారి సాధికారత, రక్షణ, న్యాయ పరంగా వారికి ఉన్న హక్కుల గురించి జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి కమ్ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మైనారిటీ వర్గాలకు ఉన్న హక్కుల గురించి వివరించారు. సీనియర్ న్యాయవాది ఐఎం.అహ్మద్ మాట్లాడుతూ, రాష్ట్రాల వారీగా మైనారిటీల రక్షణ చట్టం, వక్ఫ్ బోర్డు ఆస్తుల రక్షణకు సత్వర న్యాయం, సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా కమిటీ రిపోర్ట్ ఆమోదం అంశాలు పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి జ్యోతి మాధవి, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు ఆర్.శ్రీనివాసరావు, ముస్లిం, క్రిస్టియన్, జైన్ మత పెద్దలు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాయు కాలుష్య నియంత్రణకు కార్యాచరణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : జివిఎంసి పరిధిలో వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు అర్తా గ్లోబల్ సంస్థతో కలిసి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి తెలిపారు. జివిఎంసి అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, ప్రధాన ఇంజినీరు శివప్రసాద్ రాజు అధ్యక్షతన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో వాయు కాలుష్య నియంత్రణపై అర్తా గ్లోబల్ సంస్థతో కలిసి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డి.వి.రమణమూర్తి మాట్లాడుతూ, నగరంలో వాయు కాలుష్యం పెరిగిపోతుందని, నియంత్రణకు అర్తా గ్లోబల్ సంస్థ, జివిఎంసి సంయుక్తంగా నగరాన్ని క్లీన్ హెయిర్ జోన్స్‌గా నిలిపేందుకు కార్యాచరణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

క్రీడాకారులకు టీషర్టులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : డిసెంబర్ 20 నుంచి 22వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ చాంపియన్‌షిప్ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన విశాఖపట్నం జిల్లా క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ ఆధ్వర్యాన గురువారం టీ షర్టులు అందించారు.

క్రీడలతో ఆరోగ్యం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం సొంతం అవుతుందని విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎం.ప్రణవగోపాల్ పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఆరిలోవ ఛాంపియన్స్ లీగ్(ఎసిఎల్) క్రికెట్ సీజన్ -1 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యువత క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలన్నారు. ఆరిలోవ ఛాంపియన్స్ లీగ్ క్రికెట్ క్రీడా నిర్వాహక కమిటీ సభ్యులు డిజె.జగదీష్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఐపిఎల్ తరహాలో 8 ఫ్రాంచైజీలతో ఆరిలోవ పినాకిల్ గ్రౌండ్లో క్రికెట్ మ్యాచులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు బి.మురళి, హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి యువకులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని యువకులకు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సత్య పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఎస్‌సి యువకులకు న్యాక్ ఆధ్వర్యాన స్మార్ట్ మీటర్స్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ.7500 స్టైఫండ్ కూడా ఉంటుందని పేర్కొన్నారు. పదవ తరగతి, ఐటిఐ ఉత్తీర్ణత సాధించిన యువకులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. వివరాలకు 83090 03957 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ద్రోణంరాజు జయంతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వైసిపి రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్ ఆధ్వర్యాన రాజ్యసభ మాజీ సభ్యుడు, కీర్తిశేషులు ద్రోణంరాజు సత్యనారాయణ 92వ జయంతిని నిర్వహించారు. సిరిపురం జంక్షన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి లర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పేడాడ రమణికుమారి, హరి వెంకటకుమారి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ప్రియాంక దండి ఆధ్వర్యాన సిరిపురం జంక్షన్‌లోని ద్రోణంరాజు విగ్రహానికి పూల మాల వేసి నివాళి లర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిరిడి భగత్, కెవి.సూర్యనారాయణ, గుర్రం కనకరాజు, సోడదశి సుధాకర్ పాల్గొన్నారు.

రైతు బజార్‌లో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎంవిపి రైతుబజార్‌లో గురువారం జిల్లా తూనికలు కొలతల అధికారి అప్పలరాజు, ఇన్‌స్పెక్టర్ రామారావు వస్తువుల నాణ్యత, ప్రమాణాలు, తూకంలో జరిగే మోసాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

విశ్రాంత ఎస్‌బిఐ ఉద్యోగికి వేధింపులు

ప్రజాశక్తి- సీతమ్మధార :ఉద్యోగ విరమణ చేసిన ఎస్‌బిఐ ఉద్యోగి ఎం.రాజకిషోర్‌పై కులపరమైన వేధింపులు దుర్మార్గమని అంబేద్కర్ నేషనల్ ఎస్‌సి, ఎస్‌టి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. గురువారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ దళితుడైన రాజ కిషోర్‌ను ఎస్‌బిఐ యాజమాన్యం అకారణంగా సస్పెండ్ చేయడంతోపాటు రిటైరైన తర్వాత కూడా కక్ష సాధింపు చర్యలు ఆపలేదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, బకాయిలు చెల్లించకుండా వేధిస్తోందన్నారు. విదసం ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ వెంకటరావు మాట్లాడుతూ దళితుడైన రాజకిషోర్‌కు న్యాయం జరిగే వరకు అండగా పోరాడతామన్నారు

విశ్రాంత ఉద్యోగి రాజకిషోర్ మాట్లాడుతూ గతంలో ఒక వివాదంలో అవతల వ్యక్తిదే తప్పని కోర్టు నిర్ధారించినప్పటికీ, యాజమాన్యం నిరాధారమైన ఆరోపణలతో తనను మానసిక క్షోభకు గురిచేయడమే కాక, రావాల్సిన ఆర్థికప్రయోజనాలను చెల్లించడం లేదన్నారు.కోన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -భీమునిపట్నం :స్థానిక బీచ్ రోడ్డులోని జీసస్ పార్కులో భీమిలి, వైఎంసిఎ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎంసిఎ విశాఖ సబ్ రీజినల్ వైస్‌చైర్మన్ కెఎస్‌ఎం సుధాకర్ అధ్యక్షతన కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. జవేడుకల్లో స్థానిక సిఐ బి సుధాకర్, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, భీమిలి, తగరపువలస ఆంధ్రా బాప్టిస్టు చర్చి అధ్యక్షులు వై లివింగ్‌స్టన్, గండి జాన్‌ప్రకాష్, కార్యదర్శి ఆల్బర్ట్ సుదర్శన్, ప్రేమానందం, ఫాస్టర్లు విజయకుమార్, విలియం సునీత్‌బాబు, ప్రభాకర్, కృపారావు పాల్గొన్నారు. బాల బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తాగునీటి సరఫరాపై ఆరా

ప్రజాశక్తి- ఆనందపురం : గోస్తనీ నది నుంచి గ్రామీణ ప్రాంతాలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటుచేసిన మంచినీటి ట్యాంకులను పంచాయతీరాజ్ రాష్ట్ర కమిషనర్ కృష్ణచైతన్య గురువారం పరిశీలించారు. బోని గ్రామం వద్ద గోస్తనీలో ఉనన తాగునీటి ట్యాంకులను తనిఖీ చేశారు. దాదాపు 20ఏళ్లకుపైగా 19గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్న అక్కడి ట్యాంకు పనితీరుపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి, డిపిఒ శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ కెవివి.చౌదరి, ఈశ్వరీబాయ్, ఎఇఇ హరీష్, ఎంపిడిఒ డాక్టర్ జానకి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల, శ్రీనుబాబు, పార్టీ ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, రామస్వామి ,ప్రధాన కార్యదర్శి మూర్తి, నాయుడు, శంకర్, అప్పలరాజు సురేష్ పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై కళా ప్రదర్శన

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహనకు ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో బుర్రకథ కళాప్రదర్శన నిర్వహించారు. గురువారం ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక గంటస్తంభం ప్రాంగణంలో నిర్వహించిన ప్రదర్శనలో ఇంధన పొదుపు, పిఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలు బుర్రకథ కళాకారులు గేయాలు, నృత్యాల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎపిఇపిడిసిఎల్ ఎఇఇ సకరయ్య మాట్లాడుతూ, ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించారు.ప్రతిఒక్కరూ అవగాహన కలిగి విద్యుత్ పొదుపు పాటించాలని, విద్యుత్ ఛార్జీల నుంచి విముక్తికి సోలార్ విద్యుత్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పిఎం సూర్యఘర్ పథకం ద్వారా కల్పిస్తున్న రాయితీ, రుణ సదుపాయం, ఇతర ప్రయోజనాలను వివరించారు. జివిఎంసి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

21న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -పద్మనాభం : వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్మోహనరెడ్డి జన్మదినం సందర్భంగా పద్మనాభం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయం ప్రాంగణంలో ఈ నెల 21న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిపి కె.రాంబాబు తెలిపారు. మండల పార్టీ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణ్ నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం


● రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గాజువాక : జిఒ301 అందుబాటులోకి తెచ్చి, గాజువాక భూసమస్యను శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతానని స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కొత్త గాజువాక హైస్కూలు ప్రాంగణంలోతహశీల్దార్ శ్రీవల్లి అధ్యక్షతన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, నగర వాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒలు, కూటమి ప్రభుత్వ జిఒలకు వ్యత్యాసాన్ని వివరించారు. అధిక ఇంటిపన్ను వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదుపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, బిఎన్ పాత్రుడు, ఉరుకూటి చందు, ఎండి ఇమ్రాన్, కూటమి నేతలు మహ్మద్‌రఫీ పాల్గొన్నారు

నేరెళ్లవలసలో16 అర్జీలు

పద్మనాభం: మండలంలోని నేరెళ్లవలసలో తహశీల్దార్ కె.ఆనందరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులో భూ సర్వేకు 16 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి పరిష్కార చర్యలు చేపడతామన్నారు.

కోటవురట్ల: మండలంలో చౌడవాడ గ్రామంలో రెవెన్యూ సదస్సు తాహసిల్దార్ తిరుమలబాబు నిర్వహించారు, మండల సర్వేయర్ శ్రీనివాస్, ఆర్ఐ ఊర్ధవరావు గ్రామ సర్పంచ్ గోపాలకష్ణ పాల్గొన్నారు.



సబ్బవరంలో అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్, నేతలు

సబ్బవరం : మండలంలోనిఅజనగిరి గ్రామంలో రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై 7 అర్జీలు అందినట్లు తహశీల్దారు బి.చిన్నకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఇందల వెంకటరమణ, బలిరెడ్డి అప్పలరాజు, ఆర్ఐ వీరయ్య, రీ సర్వే డిటి గణపతిరావు, వీఆర్వో వినోద్, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వెలుగు సర్వేయర్ రాంబాబు పాల్గొన్నారు.

నక్కపల్లి:రెవెన్యూ పరమైన సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని తహసిల్దార్ నరసింహామూర్తి తెలిపారు. మండలంలోని చీడిక గ్రామంలో గురువారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సత్తిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి శుద్ధి పరిజ్ఞానంపై అవగాహన

● గీతం వర్సిటీని సందర్శించి రసాయన శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్



రసాయన శాస్త్రవేత్త ప్రదీప్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఐఐటి చెన్నై సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ప్రదీప్ గురువారం సందర్శించారు. దాదాపు 100కు పైగా ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు పొందిన డాక్టర్ ప్రదీప్, తాగునీటిని శుద్ధి చేసే పరిజ్ఞానాన్ని అభివద్ధి చేయడంతో పాటు పంటలలో వినియోగించే క్రిమి సంహారకాలను దిగుబడి అనంతరం తొలిగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించారు. దాదాపు 550కి పైగా పరిశోధన పత్రాలను వెలువరించిన డాక్టర్ ప్రదీప్‌కు శాంతి స్వరూప్ భట్నాగర్ వంటి ప్రతిష్టాత్మక అవార్డుతో పాటు బిఎం.బిర్లా సైన్స్ ప్రైజ్, జేసి బోస్ నేషనల్ ఫెలోషిప్, ఇండియా నానోటెక్ ఇన్నోవేషన్ అవార్డులు వరించాయి.

ఈ సందర్భంగా నూతన పదార్ధ విజ్ఞానం ఆధారంగా స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి తాను రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం గురించి గీతం పరిశోధకులకు డాక్టర్ ప్రదీప్ వివరించారు. అనంతరం స్కూల్ ఆఫ్ సైన్స్ పరిశోధకులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. అనంతరం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తరుపున గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ తదితరులు డాక్టర్ ప్రదీప్‌ను సన్మానించారు.కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరన్‌దాస్, గీతం విశిష్ట ప్రొఫెసర్, మూర్తి ప్రయోగ శాలల అధిపతి ప్రొఫెసర్ బివిఆర్ టాటా, గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ జివిఆర్ శర్మ పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు

● ఇండక్షన్ మీట్‌లో మాజీ మంత్రి ముత్తంశెట్టి



మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : ఫార్మసీ రంగంలో అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ఫార్మసీ కోర్సుల్లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కళాశాలలో ఇండక్షన్ మీట్ నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, నానాటికీ విస్తరిస్తున్న ఫార్మసీ రంగంలో, అంతే స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. సంగివలస ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ పివి సుధాకర్ మాట్లాడుతూ, నైతిక విలువలతో కూడిన విద్యను అలవర్చుకోవాలని, తద్వారా ఉజ్జ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. ఆంధ్రాయూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.గిరిజాశంకర్ మాట్లాడుతూ, ఎంచుకున్న సబ్జెక్టులో పట్టు పెంచుకోవాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని సూచించారు.అవంతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎ చంద్ర శేఖర్ పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

450 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో గొలుగొండ, కేడిపేట పోలీసులు జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా గురువారం ఏఓబి నుంచి అక్రమంగా తరలిస్తున్న 450 కేజీల గంజాయి పట్టుకున్నారని నర్సీపట్నం డీఎస్పీ మోహన్ తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజేష్ శర్మ, కిల్లో మహదేవ్ అనే ఇద్దరు వ్యక్తులు ఒక వ్యాన్‌లో ఒరిస్సా రాష్ట్రంలో మల్కన్‌గిరి జిల్లా ఆంధ్రా ఒరిస్సా బోర్డర్ చిక్రొండ ఏరియా వాటర్ ఫాల్స్ పరిసర ప్రాంతంలో 450 కేజీల గంజాయిని సేకరించారన్నారు. ఈ గంజాయిని గూడ్స్ వ్యాన్ పై భాగంలో ఐరన్ మెస్ ఏర్పాటు చేసి టార్పాలిన్స్‌లతో కప్పి ఆంధ్రా ఒడిశా బోర్డర్ దారకొండ, రంపుల ఘాట్ రోడ్ మీదుగా విశాఖపట్నం తరలిస్తుండగా గొలుగొండ మండలం చిన్నయ్యపాలెం ఫారెస్ట్ ఏరియా గ్రామ శివారున వాహనాలు తనిఖీ చేస్తుండగా గొలుగొండ ఎస్సై రామారావు, కేడిపేట ఎస్సై తారకేశ్వరరావులకు పట్టుబడ్డారన్నారు. గంజాయిని స్వాదీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి వ్యాన్, రెండు సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు.

కెనడాలో గాజువాక యువకుడు మృతి

ప్రజాశక్తి-గాజువాక : గాజువాక చట్టివానిపాలేనికి చెందిన పిల్లి ఫణికుమార్ (33) కెనడాలో ఈనెల 14న చనిపోయినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ ఏడాది ఆగస్టు 21న కెనడా వెళ్లిన పిల్లి ఫణికుమార్, అక్కడ హాస్టల్లో ఉంటూ ఎమ్మెస్ చదువుతున్నారు. 13న రాత్రి పడుకున్న ఫణికుమార్, 14న ఉదయానికి బెడ్‌పైనే చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. అక్కడున్న వారు ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే మృత్యువాత పడినట్లు నిర్ధారించారని కుటుంబసభ్యులు తెలిపారు

ఫణికుమార్ మృతి చెందిన రోజు రాత్రి ఫోనుద్వారా సమాచారం అందినప్పటికీ, మృతదేహాన్ని ఎలా తీసుకురావాలో తెలియని కుటుంబసభ్యులు స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆశ్రయించగా, ఆయన స్థానిక ఎంపీకి ఫోను చేసి చెప్పారని మృతుని తండ్రి నాగప్రసాద్ తెలిపారు.

సమస్యలపై జివిఎంసి కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి- వేపగుంట : వార్డు పరిధిలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఎన్‌ఎడి దళితకులాల సంఘాలు, అంబేద్కర్ భవన్ సభ్యులతో కలిసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌ను కలిశారు. ఈసందర్భంగా అంబేద్కర్ మైనం ప్రతిమను కమిషనర్‌కు అందజేశారు. అనంతరం సమస్యలపై చర్చించి, అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ భవన్ సభ్యుల సమస్యలను విన్నవించారు.

హెల్మెట్‌ధారణపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ: ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ద్వారకా జోన్ ట్రాఫిక్ సిఐ ప్రసాద్ అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు సిపి శంకబ్రత బాగ్చీ సూచనల మేరకు గురువారం హనుమంతువాక కూడలి ట్రాఫిక్ సిగ్నల్ వద్ద సిఐ ప్రసాద్ స్వయంగా మైక్ పట్టుకొని హెల్మెట్‌ధారణపై విస్తృతంగా ప్రచారం చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, లేకుంటే జనవరి ఒకటి నుంచి భారీ జరిమానాలు తప్పవన్నారు. మొదటిసారి జరిమానాతో హెచ్చరించి రెండోసారి లైసెన్స్ కూడా రద్దు చేస్తామన్నారు. హెల్మెట్ ధరించక పోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, వారిపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

సౌత్‌జోన్ పోటీలకు గీతం ఫుట్‌బాల్ జట్టు



గీతం ఫుట్‌బాల్ జట్టు

ప్రజాశక్తి -మధురవాడ : కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో ఏఐయు ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి దక్షిణాది రాష్ట్రాల విశ్వవిద్యాలయాల మధ్య జరిగే సౌత్‌జోన్ ఫుట్‌బాల్ (పురుషుల) పోటీలలో పాల్గొనే గీతం విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్లు క్రీడ విభాగం డైరెక్టర్ డాక్టర్ యు.విజయకుమార్ తెలిపారు. గీతం జట్టులో పి.సృజన్, ఎ.అరవిందరాజ్, ఎమ్.రిజర్డ్, కె.జనార్ధన్, వి.వెంకటరామ్, అభినవ్, అభితేజ్‌కుమార్, ఇ.డేవిడ్ ఉజోమ, జ.నిక్షిత్‌రెడ్డి, కుమార్ అర్మన్, రాహుల్‌సింగ్, వి.రఘురామన్, షెహనవాజ్, టి.దివ్యాన్ను, ఎ.అఖిల్‌కుమార్, బి.డేనియల్, ఆర్.వెంకటరమణ, సిహెచ్.సాయికుమార్ ఉన్నారు. గీతం జట్టు మేనేజర్‌గా జియాద్, కోచ్‌గా ఎమ్.రాజ్‌కుమార్ వ్యవహరిస్తారు.

ఇసుక సరఫరా కేంద్రం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : మిందిలో ఇసుక స్టాక్‌యార్డు పాయింట్, సరఫరా కేంద్రాన్ని గురువారం స్థానిక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భవన నిర్మాణదారులకు అందుబాటులో సౌకర్యవంతంగా ఉండేందుకు ఇసుక స్టాక్ పాయింట్‌ను భూగర్భగనుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని, టన్ను ఇసుకను రూ.వెయ్యికే పొందవచ్చన్నారు. అక్రమాలకు ఆస్కారం లేకుండా ఇసుక సరఫరా పారదర్శకంగా సాగుతుందన్నారు. నిర్మాణదారులకు ప్రయోజనకరంగా ఉండేందుకు ప్రాంతాల వారీగా ఇసుక సరఫరా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో గాజువాక తహశీల్దార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ద్రోణంరాజుకు ఘననివాళి


నివాళులర్పిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ అభివృద్ధికి ఎంపీగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా,రాజ్యసభ సభ్యులుగా ద్రోణంరాజు సత్యనారాయణ ఎనలేని కృషి చేశారని పలువురు కొనియాడారు. గురువారం చంద్రంపాలెం కృష్ణానగర్ కాలనీ ద్రోణంరాజు కల్యాణ మండపం ఆవరణలో ఉన్న సత్యనారాయణ విగ్రహానికి వైసిపి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, 7వ వార్డు వైసిపిఅధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కుడిటి రామారావు, పిళ్ళా అప్పన్న, పోతిన పైడిరాజు, పిళ్లా వెంకటరమణ, జగుపిల్లి నరేష్, నాగోతి తాతారావు, తదితరులు నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ ద్రోణంరాజు సత్యనారాయణ మధురవాడ అభివృద్ధికి కీలక పాత్ర పోషించారని అన్నారు, చంద్రంపాలెం హైస్కూల్, విశాఖ గ్రామీణ బ్యాంకు, మాస్టర్ ప్లాన్ రోడ్లు, మధురవాడ ప్రాంతంలో మొదట విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ద్రోణంరాజు కృషిని స్మరించుకున్నారు.

29లోగా కార్మిక సమస్యలను పరిష్కరించకుంటే

విశాఖ డెయిరీ ప్లాంట్ స్తంభన

- ఉత్తరాంధ్ర జిల్లాల్లో పాల సేకరణ నిలుపుదల చేస్తాం
- బిఎంఎస్ అండతో కార్మిక ద్రోహానికి యాజమాన్యం కుట్ర
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు.


రిలేదీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నర్సింగరావు

ప్రజాశక్తి -గాజువాక :కార్మికుల న్యాయమైన సమస్యలను ఈనెల 29లోగా పరిష్కరించకుంటే నగరంలోని విశాఖ డెయిరీ ప్లాంట్ స్తంభింపజేయడంతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పాలసేకరణ నిలుపుదల చేస్తామనిసిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు.హెచ్చరించారు. గురువారం విశాఖ డెయిరీ వద్ద డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్, కాంట్రాక్టు లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలేదీక్షల శిబిరాన్ని సందర్శించారు. కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, డిమాండ్లు నెరవేరే వరకు సిఐటియు అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ, కార్మిక సమస్యలను పరిష్కరించకుండా, పక్కదారి పట్టించేందుకు బిఎంఎస్ యూనియన్‌ను తెరపైకి తెచ్చి, విశాఖ డెయిరీ యాజమాన్యం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. కార్మికద్రోహి బిఎంఎస్‌ను అడ్డుపెట్టుకుని సంస్థకు చెందిన ఒక డైరెక్టర్ కార్మికులకు ద్రోహం చేయాలని చూస్తున్నారని, వారి ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. విశాఖ డెయిరీలో పర్మినెంట్, కాంట్రాక్ట్, ఫీల్డ్ వర్కర్స్, అగ్రిమెంట్ వర్కర్స్ అందరూ కలిపి రెండు వేలమంది వరకు పని చేస్తున్నారని, వీరిలో చాలామందికి పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు అభద్రతా భావం లేకుండా, సెలవులు, బోనస్, రెస్ట్ రూములు, పని భద్రత కల్పించాలని కోరారు. మంచి పిఆర్‌సిని డెయిరీ యాజమాన్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోరారు. కార్మికులకు పీస్ రేట్ లేకుండా, స్థిరమైన వేతనాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో ప్రతినెలా సక్రమంగా వేయాలని డిమాండ్ చేశారు.

1979లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులకు మంచి జీతాలు, ఇతర ప్రయోజనాలు సమకూరాయని,. 2004 తర్వాత యూనియన్ లేకపోవడంతో కార్మికులకు కష్టాలు మొదలయ్యాయన్నారు. యూనియన్‌కు సభ్యత్వం లేదని దుష్ప్రచారం చేస్తున్నారని, జెసిఎల్ వద్ద యూనియన్‌కున్న పట్టు ఎలా ఉందో వివరించారు. ఇన్నాళ్లు శాంతియుత ఆందోళన చేపట్టడం వల్ల యాజమాన్యం పట్టించుకోవడం లేదని, సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు ఉద్యమాన్ని ఉధృతం చేద్దామని పిలుపునిచ్చారు.

సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ మాట్లాడుతూ, న్యాయమైన హక్కులు సాధనకు ఇదే పట్టుదల, ఐక్యతతో విశాఖ డెయిరీ కార్మికులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.సిఐటియు నాయకులు ఎం. రాంబాబు మాట్లాడుతూ, ప్రస్తుతం చేస్తున్న ఆందోళనతో కార్మికుల ఐక్యతను యాజమాన్యం గుర్తించిందన్నారు. ఇదే సమయంలో దీన్ని విచ్ఛిన్నం చేయడానికి కొందరు బ్రోకర్లు యత్నిస్తున్నారని, వారి అవకాశమివ్వరాదని కోరారు. ఎస్ రమణ అధ్యక్షతన జరిగిన ఆందోళనలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. రాజేంద్రప్రసాద్, భాస్కరరావు, మారని బాబు పెద్దసంఖ్యలో డెయిరీ కార్మికులు పాల్గొన్నారు.

మహిళలకే కంటి వ్యాధులు అధికం


డాక్టర్ శివాని కొడాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : పురుషులతో పోలిస్తే మహిళల్లోనే 50 శాతం నుంచి 60 శాతం వరకు పలు రకాల కంటి వ్యాధులకు గురవుతున్నారని, ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ శివాని కొడాలి అన్నారు. జీవ సంబంధమైన, హార్మోన్ల కారణంగా వీరిలో చాలా మందికి కంటి వ్యాధులు వస్తున్నాయన్నారు. గురువారం మహిళలను ప్రభావితం చేసే ప్రధాన కంటిలోపాలు, వాటికి కారణాలపై అవగాహన కల్పించారు.. డ్రై ఐ సిండ్రోమ్, గ్లకోమా, శుక్లాలు, డయాబెటిక్ రెటినోపతి, ఆటో ఇమ్యునో డిజార్డర్స్ వంటి కంటి వ్యాధులు పురుషుల కంటే స్త్రీలలోనే ఎక్కువ శాతం మందికి సంభవిస్తాయన్నారు. డ్రై ఐ సిండ్రోమ్ పురుషులతో పోలిస్తే మహిళలకు రెండింతలు ఉంటుందన్నారు. ఈ వ్యాధిన పడిన వారిలో 60 శాతం మహిళలు హార్మోన్ల మార్పుల కారణంగా సంభవిస్తాయన్నారు. గ్లకోమా వ్యాధి నిశ్శబ్ద దొంగ వంటిదని, . ఈ వ్యాధి పురుషుల కంటే ఒకటిన్నర రెట్లు స్త్రీలలో ఉంటుందన్నారు. శుక్లాలు వయస్సు పెరిగే కొద్ది మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుందన్నారు. డయాబెటిక్ రెటినోపతి మధుమేహం ఉన్న స్త్రీలలో పురుషుల కంటే 1.3 రెట్లు ఎక్కువగా ఉంటుందన్నారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని నిర్వహించడం, యువి రక్షిత సన్ గ్లాసులను ధరించడం, మధుమేహం, రక్తపోటు వంటి వాటిని అదుపులో ఉంచుకోవడం ద్వారా మహిళలు కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని డాక్టర్ శివాని తెలిపారు.

నేటి నుంచి విజయ్ హజారే ట్రోఫీ

- 5వరకు విశాఖలో గ్రూప్ 'డి' మ్యాచ్‌లు

ప్రజాశక్తి -మధురవాడ : ఈనెల 21 నుంచి వచ్చేనెల 5 వరకు విజయ్ హజారే ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు పిఎం పాలెంలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎసిఎ, విడిసిఎ అంతర్జాతీయ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎసిఎ కార్యదర్శి సానా సతీష్ బాబు వెల్లడించారు. 21న ఛత్తీస్‌గఢ్, మిజోరం జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరగనుంది.

23న మిజోరం, ఉత్తర్‌ప్రదేశ్, 26న తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, 28న చండీగఢ్, విదర్భ, 31న తమిళనాడు, విదర్భ, వచ్చేనెల 3న చత్తీస్‌గఢ్, జమ్ముకశ్మీర్, 5న చండీగఢ్, జమ్ముకశ్మీర్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌లను ఉచితంగా తిలకించేందుకు వచ్చే ప్రేక్షకుల కోసం స్టేడియం 15వ గేటు నుంచి ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విదర్భ మినహా మిగిలినట్లు జట్లు గురువారం విశాఖపట్నం చేరుకున్నాయి.


ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం మహిళలు

ఛార్జీలు తగ్గించకుంటే మరో విద్యుత్ పోరాటం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : ట్రూఅప్, ఇంధన సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించడంతోపాటు స్మార్ట్‌మీటర్ల బిగింపును ఉపసంహరించుకోకుంటే మరో విద్యుత్ పోరాటం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ హెచ్చరించారు. గురువారం సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో బర్మా క్యాంప్‌లో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు భిన్నంగా రాష్ట్రంలో కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై విద్యుత్‌ఛార్జీలతోపాటు విపరీతమైన భారాలు మోపడం దుర్మార్గమన్నారు. నిత్యావసరాల ధరలు, పన్నులు, ఛార్జీల భారంతో ఇప్పటికే సతమతమౌతున్న ప్రజలపై కరెంట్ ఛార్జీల పెంపు భారం దారుణమన్నారు. అదానికి లాభం చేకూర్చేందుకు స్మార్ట్‌మీటర్ల బిగింపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవా లన్నారు. లేకుంటే పెద్దఎత్తున మరో విద్యుత్‌పోరాటం తప్పదని హెచ్చరిం చారు. పార్టీ జోన్ నాయకులు సిహెచ్. కమల, డి.పాపమ్మ, జి. దేవి, సీత, రత్నం, సిహెచ్ హైమ పాల్గొన్నారు.

సిపిఎం జగదాంబ కమిటీ ఆధ్వర్యాన...

విద్యుత్ ఛార్జీలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యాన రాంనగర్ బజార్‌లో నిరసన తెలిపారు. విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.రాజు, కె.నర్సింగరావు, దుర్గారావు, చిట్టిబాబు, కె.మౌళి, కెవిపి చంద్రమౌళి, కె.సంతోష్‌కుమార్‌పాల్గొన్నారు.


రామ్‌నగర్ బజార్‌లో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఓటరు జాబితా తయారీలో అప్రమత్తత

ఎన్నికల జాబితా పరిశీలకులు ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి, విశాఖ కలెక్టరేట్

ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా కీలకమని, ఓటరు జాబితా తయారీలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకులు, మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి కలెక్టరు కార్యాలయాల్లో గురువారం ఇఆర్ఒలు, రాజకీయపార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సంక్షిప్త సవరణ -2025 ప్రక్రియపై ఆయన సమీక్షించారు. ప్రతి సంవత్సరం ఓటరు జాబితా సవరణ సక్రమంగా నిర్వహిస్తే ఎన్నికల నాటికి శుద్ధమైన ఓటరు జాబితా తయారు అవుతుందని తెలిపారు. పెండింగు ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులకు నిర్ణీత సమయంలో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. పోలింగు బూత్ స్థాయిలోనే ప్రతి క్లెయిమ్ను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తే, తదుపరి స్థాయిలలో యిబ్బందులు తలెత్తవని సూచించారు. ప్రతి క్లెయింనకు సంబంధించిన రికార్డులు భద్రపరచాలన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ వివరించారు. 2024 అక్టోబర్ 29న ప్రచురించిన డ్రాఫ్ట్ పబ్లికేషను ప్రకారం జిల్లాలో 6,27,566 మంది పురుషులు, 6,62,276 మంది స్త్రీలు మొత్తం 12,89,870 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. నూరు శాతం ఫోటో గుర్తింపు ఉందని, 99.99 శాతం మంది ఓటర్లకు ఓటరు కార్డు కలిగిఉన్నారని చెప్పారు. డిశంబరు 24 తేది నాటికి క్లెయింలు, అభ్యంతరాలు పరిష్కరించడం జరుగుతుందని, 2025 జనవరి 1వ తేదీకి ఓటరు జాబితా సిద్ధం చేసి ఎన్నికల కమిషను అనుమతితో 2025 జనవరి 6వ తేదిన తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని పేర్కొన్నారు. 18-19 సంవత్సరాల యువతను ఓటరుగా చేర్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డిఒలు షేక్ ఆయిషా, వివి రమణ, ఫారెస్ట్ సెటిల్మెంటు అధికారి సిహెచ్.గౌతమి కుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.మనోరమ, గృహనిర్మాణశాఖ ప్రోజెక్టు అధికారి వై.శ్రీనివాస్, ఎన్నికల సెక్షను సూపరింటెండెంటు ఎస్వివిఎస్ నాయుడు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బొలిశెట్టి శ్రీనివాసరావు, ఆప్ ప్రతినిధి కొణతాల హరినాథ్ బాబు, ఐఎన్సి ప్రతినిధి మలపురెడ్డి కోటేశ్వరరావు, వైఎస్ఆర్సిపి ప్రతినిధి ఎం.జానకిరామరాజు, సిపిఐ(ఎం) ప్రతినిధి గంటా శ్రీరామ్, బిజెపి ప్రతినిధి పి.నాగేశ్వరరావు, లోక్‌సభ సభ్యుల ప్రతినిధి బి.తులసిరాం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

మృతుని కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని ఎన్ఎఓబి నిర్మాణ పనుల్లో డిఆర్డిఓ సబ్ కాంట్రాక్ట్ అయిన దొరాజియా కంపెనీలో సూపర్వైజర్‌గా పని చేస్తున్న బండారు నీలబాబు విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందగా, ఆయన కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇచ్చేందుకు కంపెనీ యాజమాన్యం అంగీకరించింది. పరవాడ మండలం, పరవాడ గ్రామానికి చెందిన బండారు నీలబాబు మృతి నేపథ్యంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, జి దేవుడు నాయుడు, రాంబిల్లి మండలం టిడిపి నాయకులు వసంతవాడ దిన్‌బాబు, మృతుని కుటుంబ సభ్యులు గురువారం కంపెనీ యాజమాన్య ప్రతినిధులతో చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం, ఒక లక్ష రూపాయలు దాహన సంస్కారాల కోసం ఇవ్వడానికి ఒప్పందం జరిగింది.

డయేరియా బాధితులకు డిఎంహెచ్ఒ పరామర్శ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని భరిణికం గ్రామంలో బుధవారం డయేరియాతో ఆసుపత్రిలో చేరిన బాధితులను గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎంఎస్‌వికె బాలాజీ పరామర్శించారు. వైద్యం పొంది ఇంటికి తిరిగి వచ్చి వైద్య శిబిరంలో సాధారణ చికిత్స పొందిన 20 మందిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పరిస్థితి నిలకడగానే ఉందని, ప్రైవేటు ఆసుపత్రి మెడికవర్‌లో ఒకరు, అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో ముగ్గురు, పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నలుగురు, మొత్తం 8 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. వైద్య బృందాలు గ్రామంలో ఇంటింటికి తిరిగి సర్వే చేసి వారికి వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. వైద్య శిబిరం వారం రోజులు పాటు కొనసాగుతుందన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు గురించి, ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని తగు సూచనలు ఇచ్చారు.

వికలాంగుల సంక్షేమానికి పెద్ద పీట

ప్రజాశక్తి-అనకాపల్లి : వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష ద్వారా వికలాంగ విద్యార్ధులకు అందిస్తున్న సేవలు, సదుపాయాలపై పాఠశాల విద్యాశాఖ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లాలోని 24 మండలాల్లో గల మండల విద్యాశాఖ అధికారులకు జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఒకరోజు వృత్యంతర శిక్షణా కార్యక్రమం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఇఒ మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రకాల సదుపాయాలను అందుతున్నాయా లేదా అన్న విషయంపై చర్చించారు. అనకాపల్లి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జగదీష్ మాట్లాడుతూ వికలాంగులకు అవసరమైన అన్ని రకాల ఉపకరణాలు ఉచితంగా అందజేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి అప్పారావు, రాష్ట్ర స్థాయి అబ్జర్వర్ అమ్మి నాయుడు, ఏఎల్ఎస్‌సి కోఆర్డినేటర్ గిరి, సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ బి శకుంతల, సమగ్రశిక్ష సెక్టొరియల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజలకు ప్రభుత్వ పరంగా మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. "ప్రశాసన్ గావ్ కి ఒరే" సుపరిపాలనపై కేంద్ర పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధ్వర్యంలో గురువారం వివిధ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్ లతో వెబ్ కాస్టింగ్ ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిబద్ధత కలిగిన పనితీరు చూపడం ముఖ్యమన్నారు. డిసెంబరు 19 నుంచి డిసెంబర్ 24 వరకూ ప్రశాసన్ గావ్ కి ఒరే క్యాంపెయిన్, గుడ్ గవర్నెన్స్ వీక్ నిర్వహించాలని పేర్కొన్నారు. న్యూ ఢిల్లీ నుంచి కేంద్ర పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యదర్శి వి.శ్రీనివాస్, జాయింట్ కార్యదర్శి సరిత చౌహాన్‌లు అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

రబీ వరి నాట్లుకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో ముందస్తుగా వరి కోతల కోసిన రైతులు రబీ సీజన్లో వరి నాట్లుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మంగళాపురం, విజయ రామరాజుపేట, వడ్డాది, కస్పా పొలాలలో రైతులు రెండు రోజులుగా పొలాలను దమ్ము చేస్తున్నారు. దమ్ము చేసిన పొలాల్లో వరి విత్తనాలను వేస్తున్నారు. కొంతమంది గతంలో వేసిన వరి ఆకులను పొలాల్లో నాటుతున్నారు. రెండు రోజులుగా పడుతున్న చిరుజల్లులకు రైతులు నాట్లు వేసుకుంటున్నారు.

బొజ్జన్న కొండ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల శివాలయం నుంచి బొజ్జన్న కొండ రోడ్డు నిర్మాణానికి గురువారం సర్పంచు తట్ట పెంటయ్య నాయుడు, ఎంపిటిసి సభ్యులు చదరం నాగేశ్వరరావు, కూటమి నాయకులు ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు పీలా సీతారాం, మాజీ సర్పంచ్ కర్రి బాబీ, యువ నాయకులు రాపేటి రామ్‌కుమార్, ఆడారి గోవిందరావు, పీలా బుజ్జి, పీలా విశ్వేశ్వరరావు, పీలా తాతు నాయుడు, మొగసాల వెంకట్, కోన అప్పారావు, కొత్తపల్లి జయరాజు, బుదిరెడ్డి సూరిబాబు, పల్లెల గణేష్,రాయి మురళి,ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాంబిల్లి

నర్సీపట్నంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో జరుగు సిపిఎం అనకాపల్లి జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జి.దేముడునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభ సందర్భంగా ఈనెల 21న నర్సీపట్నం టౌన్‌లో ఉదయం 10 గంటలకు జరుగు భారీ ర్యాలీ, బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. రెండు రోజులపాటు జరిగే మహాసభల్లో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన, రైతులు, కార్మికులు సమస్యలపైనా చర్చించి తీర్మానాలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామకృష్ణ, కాశీయా, నూకరత్నం, రాము, పవన్ కుమార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : సిపిఎం 24వ జిల్లా మహాసభ పోస్టర్‌ను మండలంలోని కె.సంతపాలెం గ్రామంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు గాడి ప్రసాదు మాట్లాడుతూ మహాసభలలో కార్మిక, అసంఘటిత కార్మికుల, వ్యవసాయదారుల, వ్యవసాయ కూలీల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.సంతపాలెం మహిళలు పాల్గొన్నారు.

పలు మండలాల్లో తడిసిన వరి పంట

ప్రజాశక్తి-అనకాపల్లి

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో పలు మండలాల్లో వరి పంట తడిసింది. ఇదే వర్షం మరో రెండు రోజులు కొనసాగితే ఆరు నుండి పదివేల హెక్టార్ల వరి పంట దెబ్బతినే అవకాశం ఉంది. అనకాపల్లి జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 54 వేల హెక్టార్లు కాగా 57 వేల 764 హెక్టార్లలో వరి పంట వేశారు. ఇంతవరకు సుమారు 27 వేల హెక్టార్లలో వరి కోతలు చేశారు. అనకాపల్లి మండలంలో సాధారణ విస్తీర్ణం 2798 గాను 2508 హెక్టార్లలో వరి నాట్లు వేస్తారు. ఇంతవరకు 1509 హెక్టార్ల వరి పంట కోశారు. ఇందులో 1391 హెక్టార్లు రైతులు కుప్పులుగా పెట్టారు. అయితే పనలపై ఇంకా 113 హెక్టార్లు ఉండిపోయింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే వరి పంటలు కోసి కుప్ప పెట్టకుండా ఉన్న రైతుల పంట వర్షానికి తడిసింది. ఇదే మాదిరిగా మరో రెండు రోజులు కురిస్తే గింజ నానడం, రంగు మారడం జరగవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే జిల్లాలో ఎక్కువ శాతం ఆర్‌జిఎల్ రకాన్ని వేయడంతో పెద్దగా పంట దెబ్బ తినే అవకాశం ఉండదని కూడా చెబుతున్నారు. ఇప్పటికే రైతులకు వర్షాలు పడే అవకాశం ఉన్నందున కోతలు కోయ్యవద్దని చెప్పడం జరిగిందన్నారు. గత ఏడాది డిసెంబర్లో కూడా తుఫానుకు జిల్లాలో వరి పంట ఎక్కువగా రైతాంగం నష్టపోయింది. వర్షానికి తడిసిన పంటపై ఉప్పునీరు చల్లడం ద్వారా కొంతవరకు నివారించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు.


బుచ్చయ్యపేట మండలంలో తడిసిన వరి పనలను తీస్తున్న రైతు

బుచ్చయ్యపేట : బుధ, గురువారాల్లో కురిసిన వర్షాలకు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని చిన్నఅప్పన్నపాలెం, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం తదితర గ్రామాల్లో రైతులు వరి చేలు కోసి పొలాల్లో ఆరబెట్టారు. అల్పపీడనం ప్రభావంతో బుధవారం మధ్యాహ్నం నుండి వర్షం ప్రారంభం కావడంతో పొలాల్లో గల వరి చేలు తడిసిపోయాయి. గురువారం ఉదయం నుండి చిరుజల్లులు కురవడంతో రైతులు ఆందోళనతో తడిసిన వరి పనలను కుప్పలుగా పెట్టారు. వరి పంట చేతికందే సమయంలో పలుమార్లు తుఫానుల ప్రభావంతో వర్షాలు కురవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కశింకోట : కశింకోట మండలంలోని వరి రైతులు తుఫాన్ కారణంగా ఆందోళన చెందుతున్నారు. కశింకోట, వెదురుపర్తి, సోమవరం, గొబ్బురు, భీమవరం, ఏనుగులతుని, చింతలపాలెం, నర్సింగబిల్లి, అడ్డాము, ఎన్.జి.పాలెం గ్రామాల్లో వరి పంటలు కోతలు కోసారు. తుఫాన్ హెచ్చరిక జారీ చేయడంతో కోత చేయక పోతే గింజలు రాలి నష్టం వాటిళ్ళు తుంది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి


మాట్లాడుతున్న రాజేష్

ప్రజాశక్తి-అనకాపల్లి : తడిసిన వరి పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక నాయకులు బుద్ద రాజేష్ అన్నారు. సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముందస్తు తుఫాను హెచ్చరికలు జారీ చేసినట్టు జాయింట్ కలెక్టర్ మాట్లాడడం బాధాకరమన్నారు. వాతావరణ శాఖ, వ్యవసాయ అధికారులు కానీ జెసి గానీ ముందస్తుగా రైతులకు వరి పంట కొయ్య వద్దని ఆదేశాలు ఇవ్వలేదన్నారు. తుఫాను రాకముందు రైతులు పంటను కోసి ఆరబెడుతున్న సమయంలో తుఫాను వచ్చి తడిసిపోతుంటే వరి పొలాలు కొయ్యొద్దని చెప్పి జెసి విలేకరుల సమావేశంలో మాట్లాడడం చాలా బాధాకరమన్నారు. తక్షణమే అనకాపల్లి జిల్లాలో తడిసిన వరి పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతులకు చెల్లించాలని జెసిని డిమాండ్ చేశారు.



సమావేశంలో పాల్గొన్న బొడ్డేడ ప్రసాద్, వైసిపి నేతలు

జగన్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-మునగపాక : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఈనెల 21న పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్‌లో గల క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 20న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 21న అచ్యుతాపురం మండలం, కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్‌లో వికలాంగ పిల్లలకు మధ్యాహ్నం భోజనం వసతి కల్పించడంతో పాటు, ఆరోగ్య కేంద్రాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల వైకాపా అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, బొడ్డేడ శ్రీనివాస రావు, భీశెట్టి గంగ అప్పలనాయుడు, కాండ్రేగుల జగన్, ఆడారి కాశీ బాబు, రాజాన బుజ్జిబాబు, పెంటకోట శ్రీను పాల్గొన్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : మండలంలోని కోమళ్లపూడిలో షిరిడి సాయిబాబా మందిరం వద్ద గురువారం భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. సకలా లక్ష్మీ లీలావతి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ లీలావతి కుటుంబ సభ్యులను కమిటీ సభ్యులు సత్కరించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షుడు గోకవాడ కోటేశ్వరరావు భక్తులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఇటీవల బిఎన్ రోడ్డు పక్కన విశాలమైన ప్రదేశంలో సాయిబాబా మందిరాన్ని నిర్మించారు. ప్రతి గురువారం దాతల సహకారంతో ఇక్కడ భక్తులకు అన్నదానం చేస్తున్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు లాస్య ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న కె.లాస్య జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్. తిరుపతిరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నవంబర్ నెలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 బాల బాలికల ఖోఖో పోటీలలో లాస్య ప్రథమ స్థానం సాధించి ఆంధ్ర రాష్ట్ర తరఫున జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 21 నుండి 24 తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఈ జాతీయ స్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ మేరకు లాస్యను గురువారం హెచ్ఎం ఎస్.తిరుపతిరావు, ఇన్చార్జ్ హెచ్ఎం పి.రాధ కుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు అబ్దుల్ రహమాన్, ఎంఈఓ ఎస్ లక్ష్మణరావు, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల చైర్మన్ శంకర్రావు, వైస్ చైర్మన్ జ్యోతిశ్రీ అభినందించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-కె.కోటపాడు : అనారోగ్య బాధితులు ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలోని కింతాడ పంచాయతీ గంగాభవానీపాలేనికి చెందిన అనారోగ్య బాధితుడు కిలపర్తి సన్నిబాబుకు వైద్య ఖర్చుల నిమిత్తం ఒకలక్ష 16వేల 158 రూపాయల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు గురువారం ఎమ్మెల్యే అందచేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, క్లస్టర్ ఇంచార్జి కన్నూరు సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ కశిరెడ్డి అప్పలనాయుడు, నాయకులు జూరెడ్డి రాము, దాడి ఎరుకునాయుడు, బొడ్డు అక్కునాయుడు, పూడి నారాయణమూర్తి, రుద్ర ఈశ్వరరావు, రొంగలి అప్పలనాయుడు, పైలా నారాయణమూర్తి, కొల్లి స్వామినాధం, వంటాకు శ్రీను పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించిన బాబ్జి

ప్రజాశక్తి-సబ్బవరం : మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి గురువారం ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వినతిపత్రాలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గంజాయి అక్రమ రవాణా, మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి

గంజాయి అక్రమ రవాణా, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశించారు. గ్రామస్థాయిలో ప్రజలకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, మహిళల భద్రత, సైబర్ నేరాలు తదితర వాటిపై అవగాహన కల్పించాలన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్పీ తుహిన్ సిన్హా, అనకాపల్లి డీఎస్పీ ఎం శ్రావణి, పట్టణ సిఐ టివి విజయ్ కుమార్ పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ల పరిసర ప్రాంతాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. 2022, 2023, 2024 మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి ప్రస్తుత దర్యాప్తు స్థాయిని అడిగి తెలుసుకున్నారు. క్రైమ్ రికార్డులను, కేసు నమోదు మొదలు, కోర్టు డిస్పోజల్ వరకు గ్రేవ్/నాన్ గ్రేవ్ కేసుల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ కేసుల దర్యాప్తు, గంజాయి కేసులో పురోగతి, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చీటింగ్ ఇతర కేసుల సిడి ఫైల్స్, పెండింగ్ ట్రయల్ కేసుల ఫైళ్ళు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్, కోర్టుకు సంబంధించిన రికార్డ్స్, ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసులలో దర్యాప్తు జరుగుతున్న విధానం, పురోగతిపై ఆరా తీసి, సదరు కేసుల ఛేదింపునకు దోహదపడే దర్యాప్తు విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఎన్‌డిపిఎస్ కేసుల్లో పరారీ నిందితులను అరెస్ట్ చేయడంలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాపర్టీ కేసుల్లో రికవరీ శాతాన్ని పెంచాలని, ప్రాపర్టీ నేరాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. మహిళల భద్రతకు పెద్దపీటవేస్తూ, వారి రక్షణకై మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిబద్ధత, క్రమశిక్షణతో ఉద్యోగ నిర్వహణ విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు వి సత్యనారాయణ, డి ఈశ్వరరావు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డిఐజి గోపీనాథ్

జలాశయం అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలి



పాత్రుడు నాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-దేవరాపల్లి : రైవాడ జలాశయం అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు చిత్తశుద్ధతో పనిచేయాలని, అందుకు తమ సంపూర్ణ సహకారం లభిస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక రైవాడ జలాశయం అతిథి గృహం వద్ద గురువారం దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు మండలాలకు చెందిన పదిమంది సాగునీటి సంఘాల చైర్మన్‌లతో మాట్లాడి అందరి ఏకాభిప్రాయంతో రైవాడ జలాశయం ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్‌గా మూడు సంవత్సరాలు పోతల పాత్రుడు నాయుడు (ఎం.అలమండ), తరువాత రెండు సంవత్సరాలు ప్రస్తుత వైస్ ఛైర్‌పర్సన్ బొడ్డు ఉమాదేవి ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతారని చెప్పారు. కొత్త ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక, ప్రమాణ స్వీకారం ఈనెల 21న అధికారికంగా జరుగుతుందని తెలిపారు. అనంతరం పాత్రుడు నాయుడు, ఉమాదేవిలను ఎమ్మెల్యే బండారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మండల పార్టీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చరకాన సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొమర బాబురావు, పెద్దాడ వెంకటరమణ, చల్లా నానాజీ, సోమిరెడ్డి గోవింద, దొగ్గ దేముడు నాయుడు, బండారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు-పినగాడి రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు

దేవరాపల్లి : కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాడేరు నుంచి పినగాడి వరకు 4 వరుసల రోడ్డు నిర్మించే ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ఈ రోడ్డుని నియోజకవర్గ కేంద్రం మాడుగులను కలుపుతూ అర్జునగిరి, కలిగొట్ల, కె.కోటపాడు మీదుగా పినగాడి ప్రధాన కూడలి జాతీయ రహదారికి అనుసంధానం చేస్తామని చెప్పారు. గురువారం దేవరాపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం జరిగితే అటు విమానాశ్రయానికి, ఇటు విశాఖ పోర్టుకి దగ్గర మార్గం అవుతుందన్నారు. గిరిజనులు పండించే ఉత్పత్తులు విశాఖ నగరానికి తరలించడం సులభం అవుతుందని చెప్పారు. అలాగే ఒరిస్సా కలకత్తా, మద్రాసు వంటి దూర ప్రాంతాలకు తక్కువ సమయంలో ప్రయాణించే సౌలభ్యం కలుగుతుందని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వివరించినట్లు చెప్పారు.

జోరుగా రోడ్డు నిర్మాణం

దేవరాపల్లి : మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కృషితో వాలాబు పంచాయతీ శివారు గ్రామాలకు రోడ్డ నిర్మాణం వేగంగా జరుగుతున్నాయని సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి, బుజ్జి తెలిపారు. స్థానిక రైవాడ అతిథి గృహంలో గురువారం ఎమ్మెల్యే బండారుకు పనులు జరుగుతున్న తీరును వారు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలాబు జంక్షన్ నుంచి సరియా గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 20 రోజుల వరకు ఈ రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని సర్పంచ్ వెంకటలక్ష్మి, బుజ్జి కోరారు.

ఘనంగా ఎంపీపీ సూరిబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు జన్మదిన వేడుకలు గురువారం అత్యంత అట్టహాసంగా జరిగాయి. గోపాలపురం గ్రామం ఆయన స్వగృహం వద్ద జరిగిన ఈ వేడుకల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని గజమాల, పూలమాలలు పూల బొకేలు, దుస్సాలువాలతో ముంచెత్తారు. వైయస్సార్ సిపి నాయకులు, మండలానికి చెందిన పలువురు వైఎస్ఆర్సిపి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, జడ్పీ వైస్ చైర్ పర్సన్ బీవీ సత్యవతి, మందపాటి జానకి రామరాజు, పెద్దిశెట్టి గోవింద, మల్ల బుల్లి బాబు, దంతులూరి శ్రీధర్ రాజు, జాజుల రమేష్, మలసాల కిషోర్, విల్లూరి చంద్రశేఖర్, తట్టా పెంటయ్య నాయుడు, పలు పంచాయతీల కార్యదర్శులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి-మునగపాక : గ్రామాలలో ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేసుకోవాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని తోటాడ గ్రామంలో గల పిఎసిఎస్ (గోడౌన్)లో సోలార్ విద్యుత్తు వినియోగంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదు గ్రామాలలో ఒక గ్రామంగా తోటాడ గ్రామం సోలారు మోడల్ గ్రామంగా గుర్తించడం జరిగిందని తెలిపారు. గ్రామంలో గల ప్రతి ఇంటికి సోలారు విద్యుత్ ఏర్పాటుచేసుకొని శతశాతం సోలారు గ్రామంగా రూపుదిద్దుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, పలు శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని గొండుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో, ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యతో గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిరేంచారు. గ్రామస్తులు, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మొత్తం 248 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 49 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్ చేయుటకు విశాఖపట్నంలోని ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి సిఫార్సు చేశారు. పేదలకు ఉచితంగా కంట అద్దాలు ఇవ్వడానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ కార్యదర్శి బొంతు మంగపతిరావు, సభ్యులు బివి.రమణమూర్తి, రమేష్, ఎల్వి నారాయణరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, పాత్రుడు మాస్టారు, గ్రామ సర్పంచ్ భర్త బండారు లక్ష్మణ పాత్రుడు, ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి క్యాంపు కోఆర్డినేటర్, సిబ్బంది పాల్గొన్నారు.

రమేష్‌ను అభినందించిన ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి ఎన్‌టిఆర్ వైద్యాలయం డైరెక్టర్‌గా నియమితులైన టిడిపి తాళ్లపాలెం గ్రామ అధ్యక్షులు ఉల్లింగల రమేష్ గురువారం తన అనుచరులతో కలిసి అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణను కలిశారు. ఈ సందర్భంగా రమేష్‌ను ఎమ్మెల్యే కొణతాల అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతుని శ్రీనువాసరావు, ఉగ్గిని రమణమూర్తి, వేగి గోపీకృష్ణ, బలిజ మునిసిరి నాయుడు, సిదిరెడ్డి శ్రీను, నైనముశెట్టి రమణరావు పాల్గొన్నారు.

విద్యుత్ సేవల కోసం 1912కు కాల్ చేయండి

ప్రజాశక్తి-కశింకోట : విద్యుత్ సేవలు కోసం 1912 నెంబర్‌కు సంప్రదించాలని ఏపిఈపిడిసిఎల్ కశింకోట ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రామకృష్ణ కోరారు. కశింకోట డివిజన్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గృహ సోలార్ విద్యుత్ డివిజన్‌లో మొదట రెండు గ్రామాల్లో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన సబ్సిడీపై ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. బయ్యవరం, తోటాడ గ్రామాల్లో వీటిని వేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ మోటారు కోసం 50 వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. విలేకరుల సమావేశంలో ఏఏఈ మధు, శివ రామ్ పాల్గొన్నారు.

కంపెనీ సెక్రటరీస్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విద్యార్థులకు కంపెనీ సెక్రటరీస్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సును విశాఖపట్నం చాంబర్ ఆఫ్ సెక్రెటరీ చైర్మన్ మనోజ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్, కామర్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడి వి.అప్పలనాయుడు ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మనోజ్ కామర్స్ విద్యార్థులకు ఉండే ఉద్యోగ అవకాశాలు, కంపెనీ సెక్రటరీస్ కోర్సులపై అవగాహన కలిగించారు. పి కిరణ్ కుమార్ మాట్లాడుతూ కామర్స్ కోర్సు చదివిన విద్యార్థులకు పట్టణాల్లో విపరీతమైన డిమాండ్ ఉన్నదని, అదనపు కోర్సులు నేర్చుకోవడం వల్ల త్వరగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెంబర్స్ గణేష్, వినోద్. కామర్స్ డిపార్ట్మెంట్ లెక్చరర్ బి.పిచ్చమ్మ, గెస్ట్ లెక్చరర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

48 గంటల్లోనే ధాన్యం కొనుగోలు నగదు జమ

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నాతవరం:వ్యవసాయంపై ప్రతీ ఒక్కరు దృష్టి సారించాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మండలంలోని మర్రిపాలెం గ్రామంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సేంద్రియ వ్యవసాయంతో పండించిన స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.1600 కోట్ల డబ్బులు ఎగ్గొట్టిందని అన్నారు. ఆ సొమ్మును రైతులకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చెల్లించిందన్నారు. గత ప్రభుత్వంలో నాతవరంకు చెందిన రైతులు ధాన్యాన్ని చోడవరం వెళ్లి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఈ మండలంలోనే అమ్ముకునే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. నాతవరం మండలంలో ఏనిమిది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. రైతులు వాట్సాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చునన్నారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం ఇచ్చిన 48 గంటల్లోనే సొమ్మును ప్రభుత్వం రైతు ఖాతాల్లో జమ చేస్తుందని చెప్పారు. ప్రతీ ఒక్కరు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి ఆర్థికంగా ఎదగాలని కోరారు. తాండవ జలాశయ ఛైర్మన్‌గా కరక సత్యనారాయణను నియమించామని ప్రకటించారు. రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఏ.వేణుగోపాల్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మోహన్‌రావు, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, మాజీ జడ్పిటిసి కరక సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపిపిలు పారుపల్లి కొండబాబు, సింగంపల్లి సన్యాసిదేముడు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు



ఉత్సవాలు నిర్వహిస్తున్న పురోహితులు

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను పెద్ద పల్లకిలోనూ, గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తులను పల్లకిలోను వేయింపజేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి

ప్రజాశక్తి-రావికమతం:జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ శాఖ ఏఈ నందన్ గురువారం పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ, ఎల్ఈడి బల్బులను వాడటంతో అరవై శాతం విద్యుత్తు ఆదా అవుతుందని ఆయన తెలిపారు. ఇంట్లో వాడే బల్బులు, ఫ్యాన్లు, ఫ్రిజ్లు, టీవీ, ఏసిలను ఉపయోగించేటప్పుడు అవసరమైన మేరకు మాత్రమే వినియోగించుకోవాలని కోరారు. ప్రత్యేక సభల ద్వారా విద్యుత్తు ఇంధన పొదుపు పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యుత్ లైన్ మాన్‌లు, ఆపరేటర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో పెన్షన్లు

జిల్లా ఖజానా అధికారి లక్ష్మీసుభాషిణి

ప్రజాశక్తి -కోటవురట్ల:వివిధ ప్రభుత్వ రంగ కార్యాలయంలో సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో పింఛన్లు అందజేస్తున్నట్లు జిల్లా ఖజానా అధికారి లక్ష్మీ సుభాషిణి తెలిపారు. గురువారం మండలంలో ఉప ఖజానా కార్యాలయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 8 ఖజానా కార్యాలయాల్లో సుమారు 8300 మంది పింఛనుదారులకు లైవ్ సర్టిఫికెట్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టి సకాలంలో పింఛన్లు అందజేస్తున్నామని తెలిపారు. కోటవురట్ల, మాకవరపాలెం, నాతవరం మండలాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కోసం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.జిల్లాలో నాలుగు ఉప ఖజానా కార్యాలయాలు మంజూరయ్యాయని, నర్సీపట్నం, అనకాపల్లి, కోటవురట్ల, నక్కపల్లి, నూతనంగా భవనాలకు గాను ఒక్కొక్క భవనానికి 75 లక్షలు మంజూరు కాగా నర్సీపట్నం, అనకాపల్లి భవనాలు వివిధ కారణాలతో నిర్మాణాలు నిలిచి పోయినట్లు తెలిపారు. కోటవురట్ల, నర్సీపట్నం మండలాల్లో ఖజానా కార్యాలయాలు దాదాపు 75శాతం పూర్తి అయినట్లు తెలిపారు. వచ్చే మార్చి నాటికి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అనంతరం ఆమె నిర్మాణంలో ఉన్న ఖజానా కార్యాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపఖజానా అధికారి రామారావు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



భవనం పనులను పరిశీలిస్తున్న సుభాషిణి

ముందుకు సాగని రోడ్డు నిర్మాణ పనులు

-వర్షాలకు అస్తవ్యస్తంగా రహదారి
-అవస్థలు పడుతున్నవాహనదారులు



బురదగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి -రావికమతం:దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందాగా మారింది రావికమతం నుండి రోలుగుంట వరకు వెళ్లే రోడ్డు పరిస్థితి. నవంబరు 27న మేడివాడలో సిసి రోడ్డు నిర్మాణ పనులను చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. కానీ, పనులు మాత్రం ముందుకు సాగ లేదు. ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేసినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. ప్రజాప్రతినిధులకు, అధికారులకు చెడ్డ పేరు తీసుకు వచ్చే విధంగా కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ ఏదైనా పనిని టెండర్ ద్వారా తీసుకున్నప్పుడు నిర్ణీత సమయం సమయంలోపు ఆ పనిని పూర్తి చేయాల్సి ఉంది. లేకుంటే ఆ టెండర్ రద్దు చేసి మరల కొత్తగా టెండర్లకు పిలవాల్సి ఉంది. అటువంటప్పుడే కాంట్రాక్టర్లు శ్రద్ధ తీసుకుంటారు. లేకుంటే ఇదే పరిస్థితి కొన సాగుతుంది. చినుకు పడితే చాలు ఈ రోడ్డు చిత్తడి, చిత్తడిగా మారుతోంది. దీంతో, వాహన చోధకులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బైక్లిస్టులు గొయ్యిలలో పడి పలు ప్రమాదాలకు గురవుతున్నారు ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాల కార్మికులతో పనులు చేయించొద్దు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం పరిసర ప్రాంతాలలో ఇటుక బట్టీలను ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా సివిల్ జడ్జ్ షియాజ్ ఖాన్, లేబర్ ఆఫీసర్ రామచంద్ర గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బట్టీల యాజమాన్యంతో మాట్లాడుతూ, లేబర్ యాక్ట్ ప్రకారం బాల కార్మికులతో పనులు చేయించవద్దన్నారు. కార్మికులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి

కాలువలో పడి గేదె మృతి

ప్రజాశక్తి- ఎస్.రాయవరం: మండలంలోని తీరప్రాంత గ్రామమైన బంగారమ్మపాలెం ఏటి మొగ కాలువలో పడి గేదె మృతి చెందినట్లు గ్రామ సర్పంచ్ మైలపల్లి శ్రీనువాసరావు తెలిపారు. గురువారం ఆయన ఇచ్చిన సమాచారం మేరకు... బుధవారం సాయంత్రం గ్రామానికి చెందిన కారే అంజి అనే మత్స్యకారుడుకి చెందిన గేదె కనిపించక పోవడంతో బంధువులు, స్థానికులు గాలింపు చేపట్టారన్నారు. ఏటి మొగ కాలువలో పడి గేదె మృతి చెందిందన్నారు.గేదె విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుదని బాధితుడు కాశీ తెలిపారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో గుడ్డిప గ్రామంలో మరిడిమాంబ పండగ మహోత్సవాన్ని గ్రామ ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన బంధువులు, గ్రామస్తులు దేవస్థానం వద్దకు చేరుకొని గురువారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ గుమ్మాల గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పండుగకు విద్యుత్తు అలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.పండుగకు వచ్చిన ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సర్పంచ్, కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



హాజరైన ఎంపిపి, ఎంపిటిసిలు, అధికారులు

అంచనా బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన సమావేశం గురువారం జరిగింది. 2024-25 సంవత్సర అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా బడ్జెట్ వివరాలు సూపరింటెండెంట్ రమణ చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ రాజేశ్వరి మాట్లాడుతూ సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్లో వచ్చిన ఆదాయానికి గాను ప్రారంభ నిలువ 60 లక్షలు అని వచ్చిన ఆదాయంతో కోటి 78 లక్షలు అని, ఖర్చులు 88 లక్షలు అని మిగతా సొమ్మును సభ్యుల ఆమోదం మేరకు పంచాయతీలో అభివృద్ధి చేస్తామన్నారు. 5శాతం షెడ్యూల్ కులాల సంక్షేమానికి, 6శాతం షెడ్యూల్ తెగల సంక్షేమంకు, 15శాతం మహిళా శిశు సంక్షేమానికి కేటాయించారు. 12శాతం తాగునీరు, 23శాతం మెయింటెనెన్స్, 15శాతం కార్యాలయపు నిర్వహణ నిమిత్తం, 10శాతం మండల సెక్టోరియల్ యాక్టివిటీకి కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సిడిపిఒ

అంగన్వాడీ కేంద్రాల్లో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పలు అంగన్వాడీ కేంద్రాలను సిడిపిఒ ఉషారాణి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్తకోట, కన్నంపేట, యస్ఆర్ఎస్ కాలనీ, ఒమ్మవరం గ్రామాలలో వున్న కేంద్రాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల తల్లిదండ్రులకు ప్రీ స్కూల్ పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. కిశోర్ బాలికలకు రక్తహీనత, ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. కిషోర్ బాలికలో డ్రాప్ ఔట్ ఎంతమంది వున్నారో గుర్తించి నివేదిక తయారు చేసి కార్యాలయానికి అందజేయాలన్నారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి


ప్రశంసా పత్రాన్ని ఇస్తున్న ప్రిన్సిపల్

సౌత్ జోన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-గొలుగొండ :గొలుగొండ డాక్టర్ బీఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చిటికెల కుమారస్వామి సౌత్ జోన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ద్వితీయ స్థానం పొంది సిల్వర్ మెడల్ సాధించారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్‌లో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న కుమారస్వామి 53 కేజీల విభాగంలో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే విధంగా విద్యార్థికి అవసరమైన తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహిస్తామని ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు తెలిపారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ శివాజీ, పీఈటి ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ వెంకట్రావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినిని అభినందించారు.


అయ్యన్నను కలిసిన ఇఒ

స్పీకర్‌ను కలిసిన అన్నవరం దేవస్థానం ఇఒ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడును స్థానిక కార్యాలయంలో అన్నవరం దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. బలిఘట్టం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయాన్ని అన్నవరం దేవస్థానం దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధిపై చర్చించారు. బలిఘట్టం సత్యనారాయణ స్వామి ఆలయంలో పని చేస్తున్న అర్చకులు, నాయీ బ్రాహ్మణులు, రజకుడు, స్వీపర్, వాచ్‌మెన్ వంటి సిబ్బంది జీతభత్యాలు అన్నవరం దేవస్థానం చెల్లించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసి చంద్రశేఖర్, పి ఆర్ఓ కొండలరావు, సూపరింటెండెంట్ రమణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, బలిఘట్టం సత్యనారాయణ స్వామి, ఆలయ ఈవో దివ్య తేజ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పథకాల అమలులో చురుకైన పాత్ర పోషించాలి

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ విఆర్.కృష్ణ తేజ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ పథకాల అమలులో 100 శాతం చురుకైన పాత్ర పోషించాలని, ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ విస్తరణ అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ విఆర్.కృష్ణ తేజ మైలవరపు ఆదేశించారు. గురువారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో విస్తరణాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్స్ పూర్తి స్థాయిలో పనిచేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలియజేశారు.
తదుపరి అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాకు చెందిన మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ప్రగతిని సమీక్షించారు. మధ్యాహ్నం జిల్లా ప్రజా పరిషత్, విశాఖపట్నం కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి పి.నారాయణమూర్తి, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, డిపిఆర్‌సి ప్రిన్సిపల్ ఇ.నాగలక్ష్మి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమాదేవి, విశాఖపట్నం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నర్సీపట్నంలో నిరసన చేపడుతున్న లోకనాథం, నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను పార్లమెంట్ సమావేశంలో అవమాన పరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం జగదాంబ సమీపంలోని సిఐటియు ఆఫీసు నుంచి డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం వరకు ఆదివాసి గిరిజన సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కో-కన్వీనర్ డాక్టర్ మిడియం బాబూరావు మాట్లాడుతూ, రాజ్యసభలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అమిత్‌షా అవమానించడాన్ని ఖండించారు. అమిత్‌షాకు మద్దతుగా ప్రధానమంత్రి మాట్లాడటాన్ని తీవ్రంగా విమర్శించారు. ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ నాయకులు పి.అప్పలనరస, కెవిపిఎస్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు, ఆదివాసి మాతృ భాష విద్యా వాలంటీర్ల రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీను, కె.డోమ్బు, మెడికల్ రిప్రజెంటివ్స్ యూనియన్ నాయకులు కెవిపి చంద్రమౌళి, కళాధర తదితరులు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యాన నిరసన తెలిపారు. దళిత సంఘాల నాయకులు బొడ్డు కళ్యాణ్ రావు, జెవి.ప్రభాకర్, డి.రాంబాబు, రాజేంద్రప్రసాద్, శాంతారావు, జగ్జీవన్‌రామ్, చెన్నారావు, ఎస్.రాజులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నగర కాంగ్రెస్ ఆధ్వర్యాన డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు పిరిడి భగత్, నాయకులు రామారావు, కెవి.సూర్యనారాయణ, సోడాదాసి సుధాకర్, చిన్నబాబు, కస్తూరి, అప్పారావు, జగన్ మురారి, కాండవ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు ఎం..సుబ్బన్న డిమాండ్ చేశారు.దీనిపై పార్లమెంట్‌లో బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. గురువారం కెవిపిఎస్ గాజువాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీ, లక్ష్మీపురం దరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సోమాదుల గణేష్, జిల్లా కమిటీ సభ్యులు ఇమ్మాన్యుయేల్, స్థానిక నేతలు రమణమ్మ, రాజు పాల్గొన్నారు.

విశాఖపట్నం : అంబేద్కర్ పట్ల అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ నగరంలోని ఎల్ఐసి కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళితసంఘాలు నిరసన చేపట్టాయి. అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జెవి ప్రభాకర్ డిమాండ్ చేశారు. భీం సేన వార్ నేత రాజేంద్ర ప్రసాద్, శాంతారావు, జగ్జీవన్ రాం, చిన్నారావు, దళిత హక్కుల పోరాట సమితి నేతలు ఎస్ రాజులు,జి.రాంబాబు, ఎంపిటిసి కె.మధు, ఎయు విద్యార్థి సంఘం నాయకుడు మోహన్ పాల్గొన్నారు.



విశాఖలో...

తగరపువలస : పార్లమెంట్‌లో అంబేద్కర్‌నుద్దేశించి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను మాల మహానాడు ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు పతివాడ రాంబాబు ఖండిచారు. అమిత్‌షా రాజీనామా చేయాలని, ఈ తరహా వ్యాఖ్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని కోరారు.

అనకాపల్లి:పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను తక్కువ చేసి మాట్లాడిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని కోరుతూ సిపిఎం అనకాపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నెహ్రూ చౌక్ అంబేద్కర్ వద్ద


ఎస్.రాయవరంలో...



అనకాపల్లిలో...

నిరసన తెలిపారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పార్టీ సీనియర్ నాయకులు కాళ్ళ తేలయ్యబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అంబేద్కర్ అనడం ప్రతి ఒక్కరికీ ఫ్యాషన్ అయిపోయిందని, కనీసం దేవుని స్మరిస్తే పుణ్యం వస్తుందని పార్లమెంట్లో కేంద్ర హెూంమంత్రి వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రాజు, మండల కమిటీ సభ్యులు బి ఉమా మహేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు, కె ఈశ్వరరావు, జి సుభాషిణి, చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మామిడి రమణ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కే లోకనాథం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అబిద్‌సెంటర్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భాగా కె లోకనాథం మాట్లాడుతూ, రాజ్యంగం కల్పించిన ఓటుతో అదికారం చేపట్టిన హెూంమంత్రి రాజ్యంగం రచించిన అంబేద్కర్ను అవమానించడాన్ని ఖండించారు. దేశంలో రాజ్యంగం అమలు కాలేదని, మనువాదం అమలలో ఉందని అందుకే మతోన్మాద చర్యలు తీవ్రతరం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రదాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, సిఐటియు నేతలు కోటేశ్వరరావు, అడిగర్ల రాజు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ గౌరి, ట్రెజరర్ కెవి సూర్యప్రభ, డివైఎఫ్ఐ డివిజన్ అద్యక్షులు సిహెచ్ శివాజి, ఎస్.నాగరమణ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం:మండలంలో గెడ్డపాలెం గ్రామంలో అమిత్ షా దిష్టిబొమ్మను సిపిఎం నేతలు దగ్ధం చేశారు. ఈ సందర్బంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం సత్యనారాయణ మాట్లాడుతూ,రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేద్దామని చూస్తున్నారన్నారు. బోడపాటి లావరాజు, చెక్క అప్పారావు, వేసపు నాగేశ్, చింతల రాజు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

తొలగించిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

-రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తొలగించిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను విదుల్లోకి తీసుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్‌చేశారు. 22 సంవత్సరాల సర్వీసు ఉన్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను 90 రోజులు సమయం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అర్ధాంతరంగా తొలగించడాన్ని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ల కుటుంబాల పట్ల కనీస మానవత్వం లేకుండా తొలగించడం చాలా అన్యాయమని రౌండ్ టేబుల్ సమావేశం భావించింది. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్‌రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి చుక్కలు సత్యనారాయణ, ఎన్జీవోస్ యూనియన్ విశాఖ జిల్లా కార్యదర్శి రవిశంకర్, పలు సంఘాల నాయకులు రెడ్డి, రాము, సురేష్, సుధాకర్, శశిభూషణ్, సుభాషిని, సీతారత్నం, ముఖేష్, రమేష్, రాజ్ కుమార్, హనుమంతరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి పాల్గొన్నారు.

విశాఖలో శ్రీ లెదర్ షోరూం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎపిలో శ్రీలెదర్ తొలి షోమ్‌ను విశాఖలో ఏర్పాటుచేసినట్లు సంస్థ ప్రతినిధి శారుబ్ తెలిపారు. నగరంలోని సింగ్ హోటల్ జంక్షన్ వద్ద నూతన షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని తరగతుల ప్రజలకు అందుబాటు ధరలలో ఫుట్ వేర్ ఉత్పత్తులు శ్రీ లెదర్స్ షో రూంలో ఉన్నాయని తెలిపారు. జంషెడ్‌పూర్‌లో 1952లో సురేష్ చంద్ర ఒక స్టోర్‌తో వ్యాపారం మొదలు పెట్టారని గుర్తు చేశారు. చెన్నైలో రెండు స్టోర్లు రున్నాయన్నారు. తమ షోరూమ్‌లో బ్రాండెడ్ ఉత్పత్తులు విక్రయిస్తున్నట్టు తెలిపారు. స్పోర్ట్ బూట్లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.

సంస్థ మరో ప్రతినిధి సుశాంత్ మాట్లాడుతూ, లెదర్ బ్యాగుల ధరలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. తమకు పలు రాష్ట్రాల్లో 30 స్టోర్లు ఉన్నాయని తెలిపారు. ఇక్కడ ఫుట్ వేర్ రూ.300 నుంచి లభిస్తాయని చెప్పారు. రూ.1499 కొనుగోలు చేసే వారికి ఉచితంగా బహుమతులు అందజేస్తామన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ఈ ఆఫర్లు ఉంటాయని తెలిపారు.



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు